సిద్దిపేట
నమస్తే తెలంగాణ | మంగళవారం 8 ఏప్రిల్ 2025
TUESDAY, APRIL 8, 2025

బాధిత కుటుంబానికి వంటేరు పరామర్శ

గజ్వేల్, ఏప్రిల్ 7: మండలంలోని రంగం పేట బీఆర్ఎస్ గ్రామ నాయకుడు దుర్గారెడ్డి తల్లి అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండు మధు పరామర్శించారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

గజ్వేల్: అహ్మదీపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదవరెడ్డి

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 7: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని అహ్మదీపూర్, గిరిపల్లి, జాలిగామ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగుకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని, వర్షాల నుంచి రక్షణగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలను జిల్లా, మండల స్థాయి అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చేర్యాల, ఏప్రిల్ 7: మండలంలోని వీరన్నపేటలో చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ శ్వేత ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు ముస్త్యాల, వీరన్నపేట, చుంచనకోట, నాగపురి, శబాష్‌గూడెం, పెదరాజుపేట, తాడూరు, వేచరేణి, చిట్యాల గ్రామాల్లో ఐకేపీ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏపీఎం ప్రకాశం, సీసీ చంద్రమౌళి, వివోఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

చేర్యాల: వీరన్నపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్వేత

'డబుల్' ఇండ్ల నిర్మాణంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 7: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తికావడం లేదని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి విమర్శించారు. హుస్నాబాద్ పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 70శాతం మేర డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తిచేసిందన్నారు. ఈ సమయంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చూపుతున్నదని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చొరవ తీసుకుని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తిచేయాలని, లేనిపక్షంలో నిరుపేదల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

నేడు బందారం కథల పుస్తకావిష్కరణ సభ

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 7: ప్రముఖ కవి రచయిత తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి రచించిన బందారం కథల పుస్తక ఆవిష్కరణ సభ సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం జరుగుతుందని మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు రంగాచారి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పుస్తకావిష్కరణ సభకు ప్రముఖ పత్రిక సంపాదకుడు, రచయిత శ్రీనివాస్, శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, పలువురు సాహితీ ప్రముఖులు హాజరవుతారన్నారు. సభకు కవులు, కళాకారులు, రచయితలు, సాహితీ ప్రియులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు యాదగిరి, భగవాన్‌రెడ్డి, బాలయ్య, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రంగాచారి

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

మర్కూక్, ఏప్రిల్ 7: ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి వసంతరావు అన్నారు. సోవవారం మండలంలోని పాములపర్తిలో సర్వే సునీత సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలో మొదటిసారిగా గెలలను కోసి నంగునూరు మండలం నర్మెట్టలో ఉన్న ఫ్యాక్టరీకి తరలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రజనికాంత్, ఆయిల్‌ఫెడ్ అధికారి విజయ్, రైతు స్వామి పాల్గొన్నారు.

పాములపర్తిలోని రైతు సర్వే సునీత ఆయిల్‌పామ్ తోటలో గెలలతో వ్యవసాయాధికారులు

సేవా కార్యక్రమాలు అభినందనీయం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 7: సేవాతత్పరుడు మంకాల నవీన్‌కుమార్ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు గంప శ్రీనివాస్ అన్నారు. డాక్టర్ మంకాల నవీన్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం విద్యార్థులు, బాటసారులకు మజ్జిగ వితరణ, వృద్ధాశ్రమానికి కుక్కర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంకాల నవీన్‌కుమార్ వాసవి, అలయన్స్ క్లబ్ బాధ్యులుగా, అమర్‌నాథ్, కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి సేవకులుగా, పాత వేంకటేశ్వరస్వామి దేవాలయ అధ్యక్షుడిగా, సంతోషిమాత ఆలయ మాజీ చైర్మన్‌గా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తనదైన ముద్ర వేసుకున్నారు. కార్యక్రమంలో నేతి వేణుకుమార్,క్లబ్ అధ్యక్షుడు మురంశెట్టి కుమార్, మంజుల, శివశంకర్, సత్యనారాయణ, సంతోష్, మర్యాల వీరేశం, సుప్రియ, భార్గవి, శ్రీనివాస్, కాశీనాథ్, హరినాథ్ పాల్గొన్నారు.


వృద్ధాశ్రమానికి కుక్కర్ అందజేస్తున్న నవీన్‌కుమార్

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ మనుచౌదరి

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు రక్షణ సమితి నాయకులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 7: సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్‌తో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 54 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ అప్పుల నుంచి రైతులను రక్షించాలి

ప్రైవేట్ అప్పుల నుంచి రక్షించేందుకు అధికారులు సహకరించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరికి రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం రైతులను ప్రైవేట్ అప్పుల అధిక భారం నుంచి కాపాడటానికి, అర్హులైన రైతులందరికీ బ్యాంకు రుణాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులకు సమావేశం ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.

గజ్వేల్‌లోని ప్రభుత్వ జిల్లా దవాఖానలో అవగాహన కల్పిస్తున్న అన్నపూర్ణ

గజ్వేల్: ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

ఆరోగ్యమే మహాభాగ్యం

- సిద్దిపేట జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 7: ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యానికి మించిన సంపద లేదని సిద్దిపేట జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయసేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉంటేనే అన్ని పనులు చేసుకోవచ్చని, ప్రతిఒక్కరూ ఆహార నియమాలు పాటిస్తూ యోగా, వ్యాయామం చేయాలని సూచించారు.అంతకు ముందు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన ఆహారపు నియమాలు, జాగ్రత్తలను వివరించారు. న్యాయవాదులు,కోర్టు సిబ్బంది,కక్షిదారులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు అన్నిరకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో జడ్జిలు మిలింద్ కాంబ్లే, చందన, తరణి, సిద్దిపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

గజ్వేల్, ఏప్రిల్ 7: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని గజ్వేల్‌లోని ప్రభుత్వ జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ అన్నపూర్ణ కోరారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. మానవుడు సామాజికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా, ఆరోగ్యంగా ఉండాలని నిజ జీవితంలో దినచర్య అనేది క్రియాశీలకమైందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ రాము, డాక్టర్ నవ్యరావు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేడీ, డీసీ, రౌడీలకు కౌన్సెలింగ్

చేర్యాల, ఏప్రిల్ 7: చేర్యాల పోలీస్ సర్కిల్ పరిధిలో ఉన్న కేడీలు, డెకాయిట్స్, రౌడీలు, సస్పెక్ట్ పర్సన్స్‌కు సోమవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. కొన్ని సంవత్సరాల నుంచి దొంగతనం, ఇతర కేసుల్లో అరెస్ట్ కాబడి జైలుకు వెళ్లి వచ్చిన వారిపై హిస్టరీ షీట్స్ ఉన్న వారిని పీఎస్‌కు పిలిపించి వారి జీవన విధానాన్ని పోలీసులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కేడీ,రౌడీ,డీసీ తదితరులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. సత్ప్రవర్తనతో ఉన్నవారికి పోలీసుల సహాయ సహకారాలు ఉంటాయని, చట్టాన్ని చేతిలోకి తీసుకొని తిరిగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చేర్యాల, మద్దూరు ఎస్సైలు నిరేష్, షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

చేర్యాల సర్కిల్ కార్యాలయంలో కేడీలు, డీసీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీను

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 7: మద్దూరులోని రామాలయంలో శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయ అర్చకుడు పానుగంటి తిరుపతయ్య వైదిక నిర్వహణలో పట్టాభిషేకం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపారు. అనంతరం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పట్టాభిషిక్తుడైన రామచంద్రమూర్తి

ప్రతిభ పురస్కారాలకు ఆహ్వానం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 7: షెడ్యూల్ కులాల విద్యార్థులను ఉన్నత చదువులు చదివించడమే లక్ష్యంగా షెడ్యూల్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ పనిచేస్తుందని ఆ సొసైటీ అధ్యక్షుడు మహంకాళి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా అంబేద్కర్ జయంతి రోజు ప్రతిభ చాటుతున్న విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. జిల్లావ్యాపంగా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈనెల 10లోపు సెల్: 94404 94886 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో సొసైటీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాములు, రామస్వామి, సత్యకృష్ణ, చంద్రం సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మహంకాళి

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

కోహెడ, ఏప్రిల్ 7: దళారులను నమ్మి మోసపోవద్దని ఏఎంసీ చైర్‌పర్సన్ బోయిని నిర్మల రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని పోరెడ్డిపల్లిలో ఐకేపీ అధికారులు ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి ఐకేపీకి తీసుకువచ్చి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, నాయకులు శంకర్, రవీందర్, వెంకటస్వామి, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, చిన్న మహేందర్, ఐకేపీ ఏపీఎం తిరుపతి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బోయిని నిర్మల

సిద్దిపేటలో..

సిద్దిపేట, ఏప్రిల్ 7: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ నల్లా నరేందర్‌రెడ్డి కోరారు. సోమవారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో సిద్దిపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం గ్రేడ్ –ఏ రకం ధాన్యానికి మద్దతు ధర రూ. 2320, సాధారణ రకానికి రూ. 23,00 నిర్ణయించిందన్నారు. అదనంగా సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ అమృత సేనారెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటయ్య, సూపర్ వైజర్ సురేశ్, సిబ్బంది, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

గజ్వేల్, ఏప్రిల్ 7: మల్లన్నసాగర్ ముంపు గ్రామాల పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందనబోయిన ఎల్లయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు గ్రామాల పంచాయతీ కార్మికుల ఖాతాలు మూసివేయడంతో నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పంచాయతీ కార్మికులు అప్పులపాలై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికుల ఖాతాలను వెంటనే తిరిగి ఓపెన్ చేసి గత నాలుగు నెలల బకాయిపడ్డ వేతనాలు జమచేయాలన్నారు. కార్యక్రమంలో కొమ్ము స్వామి పాల్గొన్నారు.

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సందనబోయిన ఎల్లయ్య

నేడు ఎమ్మెల్యే పల్లా పర్యటన

చేర్యాల, ఏప్రిల్ 7: జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం చేర్యాల, మద్దూరు మండలాల్లో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం, మేక సంతోష్, మంద యాదగిరి, గీస భిక్షపతి తెలిపారు. మొదట మద్దూరు మండలంలోని లద్నూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, అనంతరం మద్దూరు మండల కేంద్రంలోని తాజ్ గార్డెన్స్‌లో నిర్వహించే మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. పట్టణంలోని రేణుక గార్డెన్స్‌లో చేర్యాల పట్టణం, చేర్యాల, కొమురవెల్లి బీఆర్ఎస్ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు సంబంధించి కార్యకర్తలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేస్తారన్నారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

చెత్తను వేరుచేసి ఇవ్వాలి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 7: చెత్తను వేరు చేసి వాహనాల సిబ్బందికి ఇచ్చి సహకరించాలని ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్ సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని 3వ వార్డులో తడి, పొడిచెత్తపై సోమవారం ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండ్ల నుంచి ఇస్తున్న చెత్తను వేరుచేయని వారికి తడి, పొడిచెత్తను వేరు చేయించారు. తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నామని, ఇండ్లలో సైతం తడి చెత్తతో ఎరువు తయారు చేసుకోవచ్చని ఆయన సూచించారు. చెత్తను వేరుచేయని పక్షంలో మున్సిపల్ వాహనాల సిబ్బంది తీసుకోరని, రోడ్ల మీద, ఖాళీస్థలాల్లో సైతం వేస్తే జరిమానా, చర్యలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు వెంకటేశ్, సాంబరాజు, శారద, సువార్త, మమత, మెప్మా ఆర్పీలు కోల సృజన, లావణ్య, స్వర్ణలత, శోభ, సరిత పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్

పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 7: పూలే జయంతిని ఘనంగా నిర్వహించుకుందామని మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ లింగాల సాయన్న అన్నారు. హుస్నాబాద్‌లోని రాజరాజేశ్వర గార్డెన్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించి నేటితరానికి వారి ఆశయాలు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈనెల 11వతేదీన జరిగే పూలే జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ గౌరవ అధ్యక్షులు గాదపాక రవీందర్, ఎనగందుల లక్ష్మీనారాయణ, ముక్కెర సంపత్‌కుమార్, రవీందర్‌గౌడ్, సింగరి, భాస్కర్, కిష్టస్వామి, చిన్నబాలు, రవీందర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లింగాల సాయన్న

ఆర్టీసీ ప్రయాణికులకు కూల్ వాటర్

చేర్యాల, ఏప్రిల్ 7: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల కోసం బస్‌స్టేషన్‌లో చల్లని నీటి సౌకర్యం కల్పిస్తున్నామని సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు తెలిపారు. సోమవారం చేర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు కూల్ వాటర్ అందించేందుకు ఏర్పాటు చేసిన ఫ్రీజర్ యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 80వేలతో కూల్ వాటర్‌ను అందించేందుకు ఫ్రీజర్ ఏర్పాటు చేశామన్నారు. వేసవి కావడంతో ప్రయాణికులు చల్లని నీటి కోసం ప్రయత్నిస్తారని, వారి దాహం తీర్చేందుకు ఉచితంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ప్రయాణికులకు కూల్‌వాటర్ అందిస్తున్న సిద్దిపేట డీఎం రఘు

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 7: ధూళిమిట్ట మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాలపల్లి, బైరాన్‌పల్లి, కూటిగల్, బెక్కల్ గ్రామాల నుంచి కొంతమంది అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట అక్రమంగా ఇసుక డంపు చేస్తే సహించేది లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇసుక అవసరమైన లబ్ధిదారులు అనుమతులు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇసుక అనుమతులు ఇవ్వాలని కూటిగల్ గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న కూటిగల్ గ్రామస్తులు

విద్యార్థిని అశ్వినికి సన్మానం

విద్యార్థిని అశ్వినికి జ్ఞాపిక అందజేస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

మర్కూక్, ఏప్రిల్ 7: మండలంలోని దామరకుంట ఉన్నత పాఠశాల విద్యార్థి అశ్విని ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన భౌతికశాస్త్రం పోటీలో 125 మూలకాలు, సంకేతాలతో సహా కేవలం 58 సెకండ్లలోనే చెప్పి కలాం వరల్డ్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో ఆయన విద్యార్థి అశ్విని, ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్యను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జిల్లా భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుల సంఘం నాయకుడు సాధత్‌అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

మల్లయ్య (ఫైల్)

నంగునూరు, ఏప్రిల్ 7: కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన పంగ మల్లయ్య సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. మల్లయ్య వీఆర్‌వోగా పనిచేస్తూ ఇటీవల జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందాడు. సోమవారం ఉదయం విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు 108 ద్వారా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మల్లయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మల్లయ్యకు భార్య గీత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టరేట్‌కు చెందిన అధికారులు మలయ్య అంత్యక్రియల కోసం రూ.20 వేలు అందజేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్ట్

నిందితులను చూపుతున్న ఎస్సై విజయ్‌కుమార్

ములుగు, ఏప్రిల్ 7: గంజాయి తాగి విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ములుగు మండలం కొట్యాల్ గ్రామ శివారులో పలువురు గంజాయి తాగి విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి జరిపిన దాడుల్లో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుల నుంచి 920 గ్రాముల గంజాయి, రూ. 33వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులు మర్కూక్ మండలం కర్కపట్ల గ్రామానికి చెందిన సారా నవీన్, సారా అశోక్, సారా సుధాకర్, యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్‌కు చెందిన కేతావత్ సంజయ్‌కుమార్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అహ్మద్‌గూడకు చెందిన కార్తిక్‌గా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా , జైలుశిక్ష

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 7: మద్యం తాగి వాహనాలు నడిపిన మందుబాబులకు సిద్దిపేట న్యాయస్థానం జరిమానా, జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. సిద్దిపేట ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో సోమవారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 13మంది పట్టుబడ్డారన్నారు. ఈ మేరకు వారిని జడ్జి కాంతారావు ఎదుట హాజరుపర్చగా విచారణ జరిపి రూ.20,500 జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

సిద్దిపేటలో క్రైస్తవుల శాంతి ర్యాలీ

సిద్దిపేట, ఏప్రిల్ 7: ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యానందం అన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణానికి సంతాపంగా సిద్దిపేటలో పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ సభ్యులు గడ్డమీది రాజగౌడ్, శోభన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

వైద్యసేవలు అందించాలి

సిద్దిపేట, ఏప్రిల్ 7: ప్రజలకు అందుబాటులో ఉండి వారికి వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.పల్వన్‌కుమార్ కోరారు. సోమవారం సిద్దిపేటలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ శ్రీకళ, డాక్టర్ అరుణ్, డెమో నవీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.